బిల్లులు రాక.. పనులు సాగక..?

- పట్టణంలో అభివృద్ధి పనులకు బిల్లులు మంజూరుకాని వైనం
- కొత్త పనులు చేసేందుకు ముందుకురాని కాంట్రాక్టర్లు
- స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అయినా పనులకు లభించని మోక్షం
- కౌన్సిల్‌లో తీర్మానం చేసినా ఫలితం శూన్యం
- ఆవేదన వ్యక్తం చేస్తున్న కౌన్సిలర్లు



పునర్నిర్మాణానికి నోచుకోని పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్ నుంచి గంజిళ్ల రోడ్డు దుస్థితి..

ఎమ్మిగనూరుటౌన్: పురపాలక సంఘ పరిధిలో అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదు. చేసిన పనులకు బిల్లులు మంజూరుకాక కాంట్రాక్టర్లు అవస్థలు పడుతున్నారు. మే 29న గ్రేడ్- 1 గా ఉన్న ఎమ్మిగనూరు మున్సిపాలిటీని స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అయ్యిందే కాని అభివృద్ధి పనులకు మోక్షం లభించడం లేదు. ప్రతి నెలా నిర్వహిస్తున్న మున్సిపల్ కౌన్సిల్ సమావేశపు అజెండాల్లో అభివృద్ధి పనుల అంశాలను చేర్చడం, వాటిని కౌన్సిల్ ఆమోదిస్తూ తీర్మానం చేయడం పరిపాటిగా మారింది. అయితే ఆయా పనుల్లో కొన్ని ఎస్టిమేషన్లు వేసి టెండర్లు వేయడం ఆ పనులను కాంట్రాక్టర్లు టెండర్లు పొందడం తప్పా పనులను మొదలెట్టలేకపోతున్నారు. ఫలితంగా మళ్లీ రీటెండర్లు అయినా ఆయా పనులు ప్రారంభం కాలేకపోతున్నాయి. దీంతో అభివృద్ధి పనులు ఎక్కడివక్కడ నిలిచిపోతున్నాయి. దీంతో తమ వార్డుల్లో పెట్టిన పనులు మొదలు పెట్టేదెన్నడో అంటూ కౌన్సిలర్లు ప్రతి కౌన్సిల్ సమావేశంలో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రూ.5 కోట్లకుపైగా బిల్లులు పెండింగ్

జూన్ నుంచి జూలై 26వ తేదీ వరకు మున్సిపాలిటీ పరిధిలో 32 పనులు పూర్తి చేశారు. కాగా అందులో సీసీ రోడ్లు, ప్యాచ్ వర్క్‌లు, బీటీ రోడ్లు, మంచి నీరు సరఫరా చేసే పనులకు సంబంధించి 15వ ఆర్థిక సంఘ నిధులు, మున్సిపల్ జనరల్ ఫండ్ నుండ్ నుంచి మంజూరు కావాల్సిన రూ.5,06,66,934 బిల్లులు పెండింగ్‌లో వున్నాయి. దీంతో ఆయా పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు బిల్లులు మంజూరు కాకపోవడంతో టెండర్లు పొందిన కొత్త పనులు చేసేందుకు ముందుకు రావడం లేదు. నిత్యం మున్సిపల్ కార్యాలయానికి రావడం ఇంజనీరింగ్ అధికారులను బిల్లులు ఎప్పుడు పడతాయని అడగడం వెనక్కు వెళ్లడం పరిపాటిగా మారింది. ఇంకా మున్సిపాలిటీ పరిధిలో దాదాపు వందకు పైగా కొత్త అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కాంట్రాక్టర్లకు బిల్లు ఇవ్వడం లేదంటూ ప్రస్తుత కూటమి ప్రభుత్వంలోని నాయకులు గగ్గోలు పెట్టారు. అయితే ప్రస్తుతం అదే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 13నెలలు గడిచినా పట్టణంలో చేసిన పనులకు బిల్లులు ఎక్కడ మంజూరవుతున్నాయని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు ప్రశ్నిస్తున్నారు. మొదట చేసిన పనులకు సత్వరం మంజూరు చేసి కొత్త పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకొవాలని కోరుతున్నారు.

శిథిలమైన రోడ్డు పునర్మిర్మాణమెయ్యేదెన్నడో?

పట్టణంలో చేపట్టిన అభివృద్ధి పనులకు బిల్లులు మంజూరు కాకపోవడంతో ప్రతిపాదించిన పనులు ఎక్కడిక్కడే నిలిచిపోయాయి. ఇందులో కర్నూలు రోడ్డులోని ఎద్దుల మార్కెట్ రోడ్డు నుంచి పట్టణంలోకి వచ్చే గంజిళ్ల రోడ్డు శిథిలం కావడంతో పట్టణ వాసులు, వాహన దారులు పడుతున్న అవస్థలు వర్ణతీతం. చిన్నపాటి వర్షానికే నీరు రోడ్డుపై వున్న గోతుల్లో నిలిచిపోయి తరచూ వాహన ప్రమాదాలు జరుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఈ రోడ్డుతో పాటు పట్టణంలోని పలు వార్డుల్లో ప్రతిపాదించిన రోడ్ల నిర్మాణాలు అటకెక్కాయి. ఆయా పనులను ప్రారంభించిన కాంట్రాక్టర్లు సగం వరకు చేసి వదిలేశారు. ఇలాంటి వాటిలో షరాఫ్ బజార్ నుంచి కలుగొట్ల రోడ్డు, 18వ వార్డులోని సీసీ రోడ్డు నిర్మాణానికి కంకర పరిచి వదిలేశారు. ఇలా చాలా పనులు ప్రారంభమే కాలేదు. బిల్లులు సత్వరం మంజూరు చేసి పాత పనులు పూర్తి చేసి కొత్త పనులు ప్రారంభించాలని మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు, పట్టణ వాసులు కోరుతున్నారు.

బిల్లులు ప్రాసెస్‌లో ఉన్నాయి



పట్టణంలో కాంట్రాక్టర్లు చేపట్టిన పనులకు సంబంధించి బిల్లులు మంజూరు చేసేందుకు ప్రతిపాదనలు పంపాం. అవి ప్రాసెస్‌లో వున్నాయి. త్వరలో బిల్లు మంజూరు అవుతాయి. ప్రతిపాదించిన పలు పనులు చేపట్టేందుకు కూడా చర్యలు తీసుకుంటున్నాం. చేసిన ప్రతి పనికి బిల్లులు మంజూరు చేయడం జరుగుతుంది. అభివృద్ధి పనులు చేపట్టడంలో ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకొంటాం.

– గంగిరెడ్డి, మున్సిపల్ కమిషనర్, ఎమ్మిగనూరు

క్లుప్తంగా

ఘనంగా జీవేశ్వర జయంతి



పల్లకీసేవలో భజనలు చేసుకుంటూ ముందుకు సాగుతున్న భక్తులు

ఆదోని అర్బన్: పట్టణంలోని శ్రీ జీవేశ్వర మహారాజ్ జయంతి సందర్భంగా కిలిచినపేటలో వెలిసిన శ్రీ అంబాభవానీ దేవాలయంలో గురువారం ప్రత్యేక పూజలు జరిగాయి. వేకువ జామున జీవేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పురవీధులగుండా పల్లకీలో స్వామివారి చిత్రపటాన్ని ఉంచి ఊరేగించారు. స్వామి వారిని ఎమ్మెల్సీ బీటీ నాయుడు దర్శించుకున్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



జయశాలిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్

ఆదోని సెంట్రల్: స్థానిక ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో జూనియర్ ఇంటర్ చదువుతున్న విద్యార్థిని జయశాలి అండర్ 16 గ్రూపు రాష్ట్ర స్థాయి జావెలెన్ త్రో పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ మురళీ మోహన్ తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ ఈ నెల 9, 10, 11 తేదీలలో గుంటూరు జిల్లా బాపట్లలో జరిగే పోటీలలో పాల్గొంటుందని తెలిపారు. ఈ సందర్భంగా వ్యాయమ ఉపాధ్యాయులు ఎర్రిస్వామి, కంబిరెడ్డితో కళాశాల యాజమాన్యం అధ్యాపకులు, విద్యార్థులు పలువురు అభినందించారు.

దర్గాలో ప్రత్యేక ఫాతెహాలు

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలుగొందుతున్న జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాకు గురువారం భక్తులు తరలివచ్చి స్వామి సన్నిధిలో భక్తిశ్రద్ధలతో ఫాతెహాలు, ప్రార్థనలు జరుపుకున్నారు. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్తీలు స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతేహాలను చేపట్టారు.

డంపింగ్ యార్డు రేకులు మాయం



పాండవగల్లులో డంపింగ్‌యార్డుపై భాగం రేకులు మాయమైన దృశ్యం

ఆదోని రూరల్: మండలంలోని పాండవగల్లు గ్రామంలోని కొండ ప్రాంతంలో నిర్మించిన డంపింగ్ యార్డు షెడ్డు పైకప్పుకు సంబంధించిన నాలుగు రేకులు మాయమయ్యాయి. బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు వాటిని దొంగలించి ఉండొచ్చని స్థానికులు తెలిపారు. దీనిపై గురువారం మాజీ ఎంపీటీసీ లింగన్న ఆధ్వర్యంలో పెద్దతుంబలం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు.

యూట్యూబ్ ఛానల్‌పై చర్యలు తీసుకోవాలి



వన్ టౌన్ సీఐ శ్రీరామ్‌కు ఫిర్యాదు చేస్తున్న చైర్మన్ రాయచోటి సుబ్బయ్య

ఆదోని అర్బన్: శ్రీ మహాయోగి లక్ష్మమ్మ అవ్వ బ్యాంకు గురించి అవాస్తవాలను వీడియో చేసి, అసత్యాలను ప్రచారం చేసిన ఓ యూట్యూబ్ ఛానల్‌పై చర్యలు తీసుకోవాలని వన్‌టౌన్ సీఐ శ్రీరామ్‌కు ఆ బ్యాంకు బీఓఎం చైర్మన్ రాయచోటి సుబ్బయ్య గురువారం ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ ఆర్బీఐ సూచనల మేరకే బ్యాంకు నడుస్తోందని, ఖాతాదారుల సహకారం , దైవానుగ్రహంతో బ్యాంకు లాభసాటిగా ముందుకు సాగుతోందన్నారు. ఓ యూట్యూబ్ ఛానల్ బ్యాంకుపై అవాస్తవాలను వీడియో చేసి అసత్య ప్రసారాలు చేసిందన్నారు. ఇలాంటి వాటిని ఖాతాదారులు నమ్మవద్దన్నారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

నందవరం : మండల కేంద్రంలోని రామమ్మ ఆలయం వద్ద బుధవారం ట్రాక్టర్ ఢీకొని తీవ్రంగా గాయపడిన సోమలగూడూరు గ్రామానికి చెందిన శేఖర్(28) కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక గురువారం తెల్లవారుజామున మృతువ్యాత పడ్డాడు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. భార్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేశవ కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టినట్లు తెలిపారు.

నేటి నుంచి జ్యోతి ఉత్సవాలు

కోసిగి: మండల కేంద్రంలోని సిద్దప్ప పాళెం, కడపాళెం వీధులలో కొలువుతీరిన చౌడేశ్వరి దేవి జ్యోతి ఉత్సవాలు శుక్రవారం నుంచి రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్తలు ఎం.ఓంప్రకాష్, డీసీ నారాయణ తెలిపారు. శనివారం వేకువ జామున జ్యోతులతో ఊరేగింపుగా ఆలయం చెంతకు చేరుకుని విశేష పూజలతో ఉత్సవాలు చేపట్టనున్నట్లు తెలిపారు.

శక్తి యాప్‌పై అవగాహన

ఆదోని సెంట్రల్: విద్యార్థులు శక్తి యాప్‌పై అవగాహన కలిగి ఉండాలని కానిస్టేబుల్ మల్లప్ప, భాస్కర్ తెలిపారు. గురువారం కస్తూర్బా గాంధీ(జనరల్) విద్యాలయంలో ప్రిన్సిపాల్ శాంత అధ్యక్షతన శక్తి యాప్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించినా, దూషించినా వెంటనే ఈ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సీఆర్‌ఎంటీ బీచుపల్లి, ఉపాధ్యాయులు అరుణ, మంజుల తదితరులు పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలు తవ్వుకోండి

నందవరం : ఇళ్లలోని బాత్‌రూమ్ నీరు, మురుగు నీరు బయటకు పోకుండా ఇంకుడు గుంతలు తవ్వుకోవాలని ఎంపీడీఓ పుల్లయ్య సూచించారు. గురువారం మండల పరిధిలోని జొహరాపురం, పెద్దకొత్తిలి, నాగలదిన్నె గ్రామాల్లో పరిశుభ్రత పనులు, చెత్త సేకరణ పనులు పరిశీలించి ఆయా గ్రామాల్లో ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ముఖ్యంగా ఇళ్లలో మురుగు నీరు రోడ్లపైకి వదులుతున్నారని, ప్రతి ఒక్కరూ తమ పరిధిలోని స్థలాలలో ఇంకుడు గుంతలు తవ్వుకోవాలన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఇంకుడు గుంతలు తవ్వుకోవాలని, ఉపాధి నిధుల కింద రూ.7 వేలు మంజూరు చేస్తామని వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ విజయమోహన్‌రెడ్డి, డిప్యూటీ ఎంపీడీఓ సందీప్, పంచాయతీ కార్యదర్శి పెద్దిరెడ్డి, నౌసన్న పాల్గొన్నారు.

నూతన వసతి నిలయం ప్రారంభోత్సవం



వసతి గృహాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు వై.సీతారామిరెడ్డి

మంత్రాలయం : మంత్రాలయంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా నూతనంగా నిర్మించిన రంగ రాయర రెసిడెన్సి (ఆర్‌ఆర్‌ఆర్) వసతి నిలయాన్ని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు వై.సీతారామిరెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రిబ్బన్ కట్ చేసి గృహ ప్రవేశం గావించారు. అలాగే నవ గ్రహ పూజ, ఆది దంపుతుల సేవలో తరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జి.భీమారెడ్డి, జిల్లా కార్యదర్శి విశ్వనాథ్‌రెడ్డి, సర్పంచు తెల్లబండ్ల భీమయ్య పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ ప్రారంభోత్సవం



స్వామి వారిని దర్శించుకుంటున్న వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వై. ప్రదీప్ రెడ్డి

పెద్దకడబూరు : మండల పరిధిలోని తారాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన లక్ష్మీనరసింహా స్వామి ఆలయం ప్రారంభోత్సవం గురువారం ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారుజాము నుంచి ఆలయ అర్చకులు లక్ష్మీనరసింహ స్వామికి ప్రత్యేక పూజలు చేపట్టారు. కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వై. ప్రదీప్ రెడ్డి , మండల అధ్యక్షుడు రామోహ్మన్ రెడ్డి హాజరై మొక్కులు తీర్చుకున్నారు. వీరికి ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి మంత్రాక్షింతలు, తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు భీమ్ సేన్ రావ్ కౌసిక్, లక్ష్మీనారాయణ రెడ్డి, గ్రామ నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మాటకు కట్టుబడటం చంద్రబాబు చరిత్రలో లేదు



బూదూరులో ప్రభుత్వ వైఫల్యాలు వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మంత్రాలయం రూరల్ : మాటకు కట్టుబడి ఉండటం చంద్రబాబు రాజకీయ చరిత్రలోనే లేదని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జి.భీమారెడ్డి ఆరోపించారు. గురువారం బూదూరు గ్రామంలో ఆయన జిల్లా కార్యదర్శి విశ్వనాథ్‌రెడ్డితో కలిసి బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం ఎన్నికల హామీలను ఉల్లఘించిన తీరును ప్రజలకు వివరించారు. కేవలం అధికారం కోసమే చంద్రబాబు ఎన్నికల ముందు ఆచరణకు సాధ్యంకాని హామీలు ఇచ్చారన్నారు. అధికారంలోకి రాగానే చేతులెత్తేయడం ఆయనకు పరిపాటి విద్యగా మారిందన్నారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు నర్సిరెడ్డి, మల్లికార్జునరెడ్డి, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలే లక్ష్యం



మాట్లాడుతున్న జీఎం అమరేంద్ర కుమార్ సుమన్

ఎమ్మిగనూరుటౌన్: ఖాతాదారులకు మెరుగైన సేవలందించడంతో పాటు వారికి బీమా సౌకర్యాన్ని అందించనున్నామని దీన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొంటే వారి భవిష్యత్‌కు ఎంతో ఉపయోగపడుతుందని ఎస్‌బీఐ అమరావతి సర్కిల్ నెట్‌వర్క్– 3 జనరల్ మేనేజర్ అమరేంద్ర కుమార్ సుమన్ అన్నారు. గురువారం పట్టణంలో ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ ఆవరణలో నిర్వహించిన గ్రామ స్థాయి జన సురక్ష కార్యక్రమంలో ఎస్‌బీఐ ఖాతాదారులు, రైతులను ఉద్దేశించి మాట్లాడారు. దేశ అభివృద్ధిలో ఎస్‌బీఐ కీలకంగా పని చేస్తోందన్నారు. ప్రతి గ్రామం , పట్టణంలోను పీఎంఎస్‌బీవై, పీఎంజేజేబీవై, ఏపీవై లాంటి పథకాలను ఖాతాదారులకు వర్తింపజేయాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ శ్రీనివాసులు, లీడ్‌బ్యాంక్ మేనేజర్ రామచంద్ర, నాబార్డ్ డీడీఎం సుబ్బారెడ్డి, చీఫ్ మేనేజర్ రవికళాధర్, ఏసీబీ చీఫ్ మేనేజర్ మహేశ్వర్ రెడ్డి,ఎస్‌బీఐ బ్రాంచ్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ప్రైవేటు స్కూలుపై విచారణ

మంత్రాలయం రూరల్ : మండల విద్యాధికారి మొయినుద్దీన్, స్థానిక స్లేట్ స్కూలుపై ఫిర్యాదులు రావడంతో డిప్యూటీ ఈఓ వెంకటరమణా రెడ్డి గురువారం విచారణ చేపట్టారు. విచారణలో భాగంగా ముందుగా ఎంఈఓ కార్యాలయంలో తనిఖీ చేశారు. అనంతరం స్లేట్ స్కూలును విజిట్ చేశారు. స్కూలు ఫీజులు, వసతులపై ఆరా తీశారు. స్కూలు ప్రాంగణంలో స్విమ్మింగ్ పూల్ నిర్మించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్న పిల్లల పాఠశాలలో స్విమ్మింగ్ ఏర్పాటు చేస్తే ఇబ్బందులు ఉంటాయని హెచ్చరించారు. అలాగే పాఠశాలలో పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు విక్రయించడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఫీజులు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా వసూలు చేయాలని సూచించారు. పాఠశాల యాజమాన్యం తీరుపై విద్యార్థి సంఘాల నాయకులు పలు విషయాలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

చేనేతల సమస్యల పరిష్కారానికి పోరాటం



ర్యాలీ నిర్వహిస్తున్న చేనేతలు

ఎమ్మిగనూరుటౌన్: చేనేత కార్మికుల సమస్యలు పరిష్కారమయ్యే వరకూ పోరాటం కొనసాగించాల్సిన పరిస్థితి ఉందని ఏపీ చేనేత కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి కాలప్ప, అధ్యక్ష, ఉపాధ్యక్షులు కామర్తి లక్ష్మన్న, కృష్ణ తెలిపారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం స్థానిక పద్మశ్రీ మాచాని సోమప్ప విగ్రహనికి చేనేత నూలు దండలు వేసి నివాళులర్పించారు. ఇందులో భాగంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ చేనేత కార్మికులకు చేతినిండా పనిలేక ఉపాధి కరువై ఇతర వృత్తుల వైపు మరలుతున్నారన్నారు. ఎన్‌హెచ్‌డీసీ కింద 50 ఏళ్లు నిండిన వారికి పింఛన్లు ఇవ్వకపోవడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు నేతన్న నేస్తం కింద ఏటా రూ.36వేలు ఇస్తామని చెప్పిందని, అధికారంలోకి వచ్చి 13నెలలు గడిచినా నేటికి అమలు చేయకుండా నేతన్నలను మోసం చేస్తోందన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు వెంకటేశ్వర్లు, తిమ్మప్ప, రామచంద్ర, సిద్ధి రామప్ప, సీఐటీయూ మండల కార్యదర్శి రాముడు తదితరులు పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఆదోని రూరల్: భారీ వర్షాలు కురుస్తుండటంతో పట్టణంలోని లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రమేష్ సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు వరదనీటిలో చిక్కుకున్నా, ఇళ్లు కూలేందుకు సిద్ధంగా ఉన్నా వెంటనే దగ్గరలోని సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలన్నారు. ప్రజల కోసం హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. హెల్ప్ డెస్క్ నంబర్‌లు 99851 16998, 98858 21076, 63000 94952, 63055 34012 నంబర్‌లను సంప్రదించాలన్నారు.

తల్లిపాలు బిడ్డకు ఆరోగ్యకరం

మంత్రాలయం రూరల్ : తల్లిపాలు శిశువు ఆరోగ్యానికి ఎంతో శ్రేయస్కరమని తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీఓ సూర్జాహాన్ అన్నారు. గురువారం స్థానిక మాతా శిశు సంక్షేమ కార్యాలయం ఎదుట సీడీపీఓ రాజేశ్వరి దేవి నేతృత్వంలో తల్లి పాల వారోత్సవాల ముగింపు కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు సుమిత్రమ్మ, విజయకుమారి, వీరగోవిందమ్మ, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రవీంద్రనాథ్ ఠాగూర్ వర్ధంతి

ఆదోనిటౌన్: పట్టణంలోని గ్రంథాలయంలో గురువారం రవీంద్రనాథ్ 84వ వర్ధంతిని లైబ్రేరియన్ ఆశాజ్యోతి, కౌన్సిలర్ వీరేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వగరూరు పాఠశాల సమస్యలు పరిష్కరించాలి

మంత్రాలయం రూరల్ : మండలంలోని వగరూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సమస్యలు పరిష్కరించాలని అఖిల భారత యువజన సమాఖ్య తాలూకా అధ్యక్షుడు జాఫర్ పటేల్ డిమాండ్ చేశారు. గురువారం సమాఖ్య ఆధ్వర్యంలో పాఠశాల ఎదుట ఆందోళన చేపట్టారు. పాఠశాలలో బాత్ రూమ్‌లు అధ్వానంగా ఉన్నాయన్నారు. 450 మందికి కేవలం ముగురు వంట మనుషులు ఉండటంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. మండల కార్యదర్శి రాజు, నాయకులు మహ్మద్ హుస్సేన్, సయ్యద్, దూద్‌పీరా, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆదోనిలో ఆగిన బసవ ఎక్స్‌ప్రెస్

ఆదోని సెంట్రల్: బాగల్ కోట్ నుంచి యశ్వంత్ పూర్ వెళ్లే బసవ ఎక్స్‌ప్రెస్ గురువారం సాయంత్రం సాంకేతిక కారణాలతో ఆదోని రైల్వే స్టేషన్లో ఆగింది. దీంతో స్టేషన్ మేనేజర్ వెంకటేశ్వర్లు గుంతకల్ నుంచి వేరే రైలు తెప్పించి ప్రయాణికులను యశ్వంత్ పూర్ తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. దీంతో రైలు అరగంట ఆలస్యమైంది.

కౌతాళం మండలాన్ని విభజించండి

కౌతాళం: మండలాన్ని మూడు మండలాలుగా విభజించాలని సీపీఎం నాయకుడు మల్లయ్య డిమాండ్ చేశారు. 36గ్రామాలు కలిగి చుట్టూ 25కిలోమీటర్ల మేర దూరం ఉందని విభజిస్తే ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుందన్నారు.

ప్రాచీన కాలం నుంచి చేనేత జాతీయ సంపద



చేనేత కార్మికురాలిని సత్కరిస్తున్న జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: ప్రాచీన కాలం నుంచి చేనేత జాతీయ సంపదగా కొనసాగుతోందని జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా అన్నారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం పట్టణంలోని కుర్ణి కళ్యాణ మండపంలో నిర్వహించిన సదస్సులో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డితో కలిసి చేనేత కార్మికులను సత్కరించి ముద్ర రుణాల మెగా చెక్కును లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ చేనేత రంగం అద్భుత కళ అని, నేత కార్మికులు ఉత్పత్తి చేసే నేత వస్త్రాలు స్వాతంత్రోద్యమం కంటే ముందు నుంచే వున్నాయన్నారు. చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. టెక్స్‌టైల్ పార్క్‌కోసం భూమిని కేటాయించామని చెప్పారు. స్థానిక టిడ్కో గృహాల కార్మికుల కోసం వీవర్‌శాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకొంటున్నామన్నారు. చేనేత కార్మికులు స్వయం సహాయక సంఘాలుగా ఏర్పడితే లబ్ధిచేకూరుతుందన్నారు. జిల్లాలో 2,457 మందికి 200ల యునిట్ల ఉచిత విద్యుత్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ముద్ర పథకం కింద ఒక్కొక్కరికి రూ.50వేల ప్రకారం రూ.83లక్షలు మంజూరు చేసినట్లు వివరించారు. సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డీఎస్పీ భార్గవి, ఎల్‌డీఎం రామచంద్ర, నాబార్డ్ డీడీఎం సుబ్బారెడ్డి, చేనేత జౌళిశాఖ సంయుక్త సంచాలకులు నాగరాజారావు, మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, స్థానిక చేనేత సొసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

మార్మోగిన ఈరన్నస్వామి నామస్మరణ





పూజలందుకుంటున్న ఈరన్నస్వామి, పొలాల్లో భక్తుల వంటవార్పు

కౌతాళం: ఉరుకుంద క్షేత్రం ఈరన్నస్వామి నామస్మరణంతో మారుమోగింది. శ్రావణమాస ఉత్సవాల్లో భాగంగా రెండవ గురువారం భక్తుల రద్దీ కొనసాగింది. భక్తులు ఉదయం నుంచే స్వామి దర్శనానికి తరలిరావడంతో ఆలయ పరిసరాల్లో ఎటుచూసినా భక్తజనమే. ఆలయ పరిసరాలల్లో స్థలం దొరకక చుట్టూ పొలాల్లో సైతం భక్తులు ప్రత్యేక వంటకాలను వండి స్వామి వారికి నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు తెల్లవారుజామున 4గంటలకు సుప్రభాతసేవ, మహామంగళహారతి, ఆకుపూజ, బిందుసేవ, పంచామృతాభిషేకం తదితర ప్రత్యేక పూజల అనంతరం భక్తులను దర్శనానికి వదిలారు. స్వామి వారి దర్శనం కోసం భక్తులు గంటకు పైగా వేచి ఉండాల్సి వచ్చింది.

పూడికతీత పనుల పరిశీలన



రాయ్‌నగర్‌లో పర్యటిస్తున్న చైర్‌పర్సన్

ఆదోని టౌన్: పట్టణంలో మంగళ, బుధవారాల్లో కురిసిన భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రధాన రహదారులతో పాటు మురుగుకాలువల్లో వర్షపునీరు నిండిపోయి రోడ్లపై ప్రవహించి ప్రజలను ఇబ్బందులకు గురి చేశాయి. గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ లోకేశ్వరి, మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ, ఎంఈ సత్యనారాయణ, డీఈలు చలపతి, ఏఈలు, కౌన్సిలర్లు బృందంగా రాయ్‌నగర్, కింది కొట్టాల, పైకొట్టాల, బోయగేరి తదితర ప్రాంతాల్లోని ప్రధాన మురుగుకాలువ, ఆవుదొడ్డి వంకతో పాటు మురుగు కాలువలను పరిశీలించారు. జేసీబీతో పూడికతీత పనులను చేపట్టారు.

ఉద్యోగులపై వేధింపులు ఆపాలి

ఎమ్మిగనూరుటౌన్: విద్యుత్ శాఖ ఉద్యోగులు, కార్మికులపై అధికారుల వేధింపులను అరికట్టాలని, ఇందు కోసం ఆందోళన బాట పట్టనున్నట్లు ఏపీఎస్పీఈ జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ జగదీష్, కన్వీనర్ నాగేషు, కో కన్వీనర్ రమేష్‌బాబు, వైస్ కన్వీనర్లు రత్నకుమార్, జయన్న, తిమ్మన్న, నబీరసూల్, కాంతారావు తెలిపారు. ఈమేరకు గురువారం సాయంత్రం ఎమ్మిగనూరు, ఆదోని డివిజన్ జేఏసీ ఆధ్వర్యంలో స్థానిక విద్యుత్ శాఖ కార్యాలయంలో ఇన్‌చార్జ్ డీఈ స్వరూప్‌కుమార్‌కు ధర్నా నోటీసును అందజేశారు. కార్యక్రమంలో సంఘ జేఏసీ నాయకులు విజయ్, ప్రవీణ్, పురుషోత్తంరెడ్డి, మాబుబాషా, హంపయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వామినాథన్ శత జయంతి

ఆదోని రూరల్: హరిత విప్లవ పితామహుడు ఎం.ఎస్.స్వామినాథన్ శత జయంతి వేడుకలను గురువారం ఆదోని పట్టణంలోని రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా ఎం.ఎస్.స్వామినాథన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె.వెంకటేశులు, జిల్లా సీఐటీయూ సీనియర్ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోండి



మాట్లాడుతున్న డీఎస్పీ హేమలత

ఆదోని అర్బన్: ఈనెల 27వ తేదీ నుంచి ఆదోని పట్టణంలో జరిగే గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఆదోని డీఎస్పీ హేమలత సూచించారు. గురువారం స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆదోని పట్టణంలోని గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో ఆమె సమావేశమై మాట్లాడారు. గణేష్ మండపాల వద్ద తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. 31వ తేదీన నిమజ్జనం ఉదయం 10 గంటలకు ప్రారంభమై రాత్రి 10 గంటలకల్లా ముగించాలన్నారు. కార్యక్రమంలో సీఐలు శ్రీరామ్, రాజశేఖర్‌రెడ్డి, రామలింగమయ్య, నల్లప్ప, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు విట్టా రమేష్, దేవిశెట్టి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సమస్యలు పరిష్కరించడంలో విఫలం

పెద్దకడబూరు : రైతు భూ సమస్యలను పరిష్కరించడంలో తహసీల్దార్ గీతాప్రియాదర్శిని పూర్తిగా విఫలమయ్యారని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు భాస్కర్ యాదవ్, మండల కార్యదర్శి వీరేష్ ఆరోపించారు. వారు మాట్లాడుతూ తహసీల్దార్‌తో పాటు వారి సిబ్బంది రీసర్వేలో భూ సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని చెబుతున్నారే తప్పా, పరిష్కరించేది మాత్రం శూన్యమన్నారు.